

క్రిస్మస్ సందడి



జిల్లాలో మంగళవారం సాయంత్రం నుంచే క్రిస్మస్ సందడి నెలకొంది. క్రిస్మస్ నేపథ్యంలో చర్చిలు విద్యుత్తు కాంతులతో ధగధగలాడాయి. బొబ్బిలి పట్టణంలోని సిబిఎం చర్చి విద్యుత్తు కాంతులతో ఆకట్టుకుంది. -ప్రజాశక్తి, బొబ్బిలి

గ్రామస్తుల సమక్షంలోనే సబ్ డివిజన్

రైతు సదస్సులో కలెక్టర్ ఆదేశాలు

ప్రజాశక్తి-డెంకాడ

భూముల జాయింట్ ఎల్‌పిఎం సబ్ డివిజన్లకు సంబంధించిన సర్వే సమస్యలను గ్రామస్తుల సమక్షంలోనే పరిష్కరించాలని కలెక్టర్ బి.ఆర్.అంబేద్కర్ తహశీల్దార్లకు సూచించారు. డెంకాడ మండలం ముంగినాపల్లిలో మంగళవారం నిర్వహించిన రెవెన్యూ సదస్సులో కలెక్టర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా పలువురు రైతులు భూముల సబ్ డివిజన్ అంశాలను విన్నవించారు. దీనిపై కలెక్టర్ స్పందిస్తూ ఆయా సమస్యలను రైతుల సమక్షంలోనే పరిష్కరించి, సబ్ డివిజన్లను ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని చెప్పారు.

అసైన్డ్ భూములు సాగుచేస్తున్న వారిలో అర్హులను గుర్తించాలి

ఈ సందర్భంగా గ్రామంలో అసైన్డ్ భూమి ఎంత, ఎంతమంది సాగుదారులు ఉన్నారనే అంశాన్ని వివరించాలని విఆర్‌ఒను ఆదేశించారు. గ్రామంలో 27 ఎకరాల అసైన్డ్ భూమి ఉండగా, దీనిలో 36 మంది రైతులు సాగుచేస్తున్నట్టు విఆర్‌ఒ వివరించారు. గ్రామంలోని పలువురు రైతులు అసైన్డ్ భూములు సాగుచేస్తున్నా వారి పేర్లు ప్రభుత్వ రికార్డుల్లో సాగుదారులుగా నమోదు లేనట్లు కలెక్టర్ గుర్తించారు. గ్రామంలోని అర్హులైన అసైన్డ్ భూముల సాగుదారులను గుర్తించేందుకు ఇద్దరు లేదా ముగ్గురు సర్వేయర్లతో కమిటీ వేసి, గ్రామంలో అసైన్డ్ భూమిలో ఎవరు సాగుచేస్తున్నారో వాస్తవంగా నిర్ధారించి వారికి పట్టాలిచ్చేందుకు ఏర్పాట్లు చేయాలని తహశీల్దార్‌కు సూచించారు. అసైన్డ్ భూములు సాగుచేస్తున్న రైతులను గుర్తించి, పట్టాలు మంజూరు చేసేందుకు జనవరిలో జరిగే నియోజకవర్గ స్థాయి అసైన్డ్ కమిటీల్లో ప్రతిపాదించాలని తెలిపారు. ఈ పేర్లను కమిటీలో పరిశీలించి ఆమోదించవచ్చన్నారు.

ప్రాజెక్టులకు భూములిచ్చిన రైతుల సమస్యలు పరిష్కరించాలి

చింతాడ నరసింహమప్పుడు అనే రైతు రెవెన్యూ సదస్సులో తన సమస్యను వివరిస్తూ, తన తండ్రి పేరున ఉన్న

రెవెన్యూ సదస్సులో రైతుతో మాట్లాడుతున్న కలెక్టర్ అంబేద్కర్

3.75 ఎకరాల భూమిలో తారకరామ తీర్థసాగర్ ప్రాజెక్టుకు ఒక ఎకరా ఇచ్చామని తెలిపారు. ఆ సర్వే నంబరులో ఉన్న భూమినంతటినీ ప్రాజెక్టు పేరుతో ఆన్‌లైన్‌లో చూపిస్తున్నారని వివరించారు. దీనిపై కలెక్టర్ స్పందిస్తూ ప్రాజెక్టుల భూసేకరణ చేసే సమయంలో భూముల సబ్ డివిజన్ చేయకపోవడం వల్ల ఈ సమస్య ఉత్పన్నమైందని తెలిపారు. భూసేకరణ చేపట్టిన వారందరి భూములు పరిశీలించి, ప్రాజెక్టుకు ఇచ్చిన భూమిని మినహాయించి, మిగిలిన విస్తీర్ణాన్ని ఆ రైతుల పేరుతో సబ్ డివిజన్ నెంబర్లు కేటాయించి ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని ఆదేశించారు.

గ్రామంలో పలువురు రైతులతో, వ్యవసాయ అధికారులతో కలెక్టర్ మాట్లాడి పంటల పరిస్థితిని తెలుసుకున్నారు. గ్రామంలో వరికి దాదాపు నష్టం లేదని, మొక్కజొన్న పంట దెబ్బతిన్నట్టు రైతులు వివరించారు. మొక్కజొన్న పంటకు జరిగిన నష్టంపై ప్రభుత్వానికి నివేదించామని కలెక్టర్ చెప్పారు. కార్యక్రమంలో తహశీల్దార్ పద్మావతి, వ్యవసాయ అధికారి, రైతులు పాల్గొన్నారు.

వినతుల పరిష్కారంపై దృష్టిపెట్టాలి

రెవెన్యూ అధికారులకు కలెక్టర్ ఆదేశం

విజయనగరంకోట : రెవెన్యూ సదస్సుల్లో వినతులను స్వీకరించడమే కాకుండా, వాటికి నాణ్యతతో కూడిన పరిష్కారం చూపాలని కలెక్టర్ బిఆర్ అంబేద్కర్.. రెవెన్యూ అధికారులను ఆదేశించారు. సదస్సుకు వెళ్లినరోజు దరఖాస్తు తీసుకున్న వెంటనే క్షేత్రస్థాయిలో విచారణ పూర్తి చేయడం ద్వారా ఆ సమస్యను తక్షణమే పరిష్కరించడం సులువు అవుతుందని సూచించారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో మంగళవారం రెవెన్యూ అధికారుల సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ వినతుల పరిష్కారానికి ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యతనిస్తోందని చెప్పారు. రెవెన్యూ సదస్సుల్లో వచ్చిన వినతులను పరిష్కరించడంలో మన జిల్లా వెనుకబడి ఉందని ఆగ్రహాన్ని వ్యక్తం చేశారు. ఇకనుంచీ ప్రతిరోజూ సాయంత్రం రెవెన్యూ సదస్సులపై సమీక్ష నిర్వహించాలని జెసికి సూచించారు. జెసి సేతు మాధవన్ మాట్లాడుతూ ఇప్పటివరకు రెవెన్యూ సదస్సుల్లో సుమారు 4,700 వినతులు అందాయని చెప్పారు. వాటి పరిష్కారంపై దృష్టి పెట్టాలని సూచించారు. కుల గణనకు సంబంధించి ఈ నెల 26న జాబితాలను వెల్లడించి, వాటిపై అభ్యంతరాలను స్వీకరిస్తారని, దీనిపై దృష్టి పెట్టాలని కోరారు. సమావేశంలో డిఆర్‌ఒ ఎస్.శ్రీనివాసమూర్తి, ఎస్‌డిసిలు మురళీకృష్ణ, నూకరాజు, సుధారాణి, ప్రమీలాగాంధీ, ఆర్‌డిఒ రామ్మోహన్, తహశీల్దార్లు, డిటిలు, ఇతర రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.

వదలని వాన.. పంటంతా నీటిలోన

వరుస వర్షాలు అన్నదాతకు కంటిమీద కునుకు లేకుండా చేస్తున్నాయి. ఆరుగాలం కష్టించి పండించిన పంటలను నాశనం చేసి, రైతులను నిండా ముంచుతున్నాయి. మొన్నటి వరకు కురిసిన వర్షాల నుంచి ఇంకా రైతులు కోలుకోలేదు. కోతలు కోసి పొలాల్లో ఉంచిన వరిచేనంతా నీటిలో మునిగిపోయాయి. పొలాల్లో వరిచేను కుప్పలన్నీ తడిసి ముద్దయ్యి, ధాన్యం మొలకెత్తుతున్నాయి. అలాంటి తరుణంలో మళ్లీ మంగళవారం ఉదయం నుంచి వర్షాలు ప్రారంభమయ్యాయి. దీంతో రైతుల్లో తీవ్ర ఆందోళన వ్యక్తమవుతోంది.

- ప్రజాశక్తి, డెంకాడ

డెంకాడ.. నీటిలోనే ఉన్న వరిచేను కుప్పలు

చండీగఢ్ విద్యుత్తు కార్మికులకు మద్దతుగా సిఐటియు నిరసన

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

విద్యుత్తు డిస్కమ్‌లను ప్రభుత్వ రంగంలో కొనసాగించాలని చండీగఢ్ విద్యుత్తు కార్మికులు, ఉద్యోగులు చేస్తున్న పోరాటానికి మద్దతుగా సిఐటియు ఆధ్వర్యాన మంగళవారం స్థానిక ఆర్‌టిసి కాంప్లెక్సు వద్ద నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి కె.సురేష్ మాట్లాడుతూ కేంద్రంలో మూడో సారి ఏర్పడిన మోడీ ప్రభుత్వం గతంలో కన్నా మరింత దూకుడుగా ప్రజా వ్యతిరేక, వినాశకర విధానాలను అవలంబిస్తోందని ధ్వజమెత్తారు. విద్యుత్తు రంగంపై బిజెపి ప్రభుత్వం చేస్తున్న దాడే ఇందుకు తార్కాణమన్నారు. చండీగఢ్, ఉత్తరప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల్లో డిస్కమ్‌లను ప్రయివేటీకరించే ప్రయత్నాలు మొదలయ్యాయన్నారు. దాదాపు అన్ని రాష్ట్రాల్లో స్మార్ట్ మీటర్లు నెలకొల్పడం ద్వారా ప్రయివేటీకరించే ప్రయత్నాలు ఊపందుకున్నాయని ఆందోళన వ్యక్తంచేశారు. విద్యుత్తు రంగాన్ని ప్రయివేటీకరించడానికి మోడీ ప్రభుత్వం చేస్తున్న ప్రయత్నాలకు వ్యతిరేకంగా దేశవ్యాప్తంగా విద్యుత్తు రంగ కార్మికులు వీరోచితమైన పోరాటం చేస్తున్నారన్నారు. అందులో చండీగఢ్ విద్యుత్తు ఉద్యోగులు, కార్మికులు అగ్రభాగాన నిలిచారని తెలిపారు. ఈ నేపథ్యంలో వారికి మద్దతుగా దేశవ్యాప్త సంఘీభావ కార్యక్రమాలకు సిఐటియు పిలుపునిచ్చిందన్నారు. ప్రయివేటీకరణకు వ్యతిరేకంగా చండీగఢ్ విద్యుత్తు కార్మికులు, ఉద్యోగులు చేస్తున్న పోరాటానికి మద్దతివ్వాలని కోరారు. విద్యుత్తు రంగ ప్రయివేటీకరణను వెంటనే ఆపాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు వి.లక్ష్మి, పట్టణ అధ్యక్ష, కార్యదర్శులు ఎ.జగన్మోహన్, బి.రమణ, పట్టణ పౌర సంక్షేమ సంఘం జిల్లా కార్యదర్శి రెడ్డి శంకరరావు, కెవిపిఎస్ జిల్లా కార్యదర్శి ఆర్.ఆనంద్, నాయకులు శ్రీను, నాయుడు, శ్యామ్, నాగేశ్వరరావు, హరీష్, రవి తదితరులు పాల్గొన్నారు.

ఆర్‌టిసి కాంప్లెక్సు వద్ద నిరసన తెలుపుతున్న సిఐటియు, ప్రజా సంఘాల నాయకులు

కరెంట్ ఛార్జీల బాదుడుపై 27న వైసిపి పోరుబాట

జిల్లా అధ్యక్షులు మజ్జి శ్రీనివాసరావు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఆరు నెలల్లోనే కరెంట్ ఛార్జీల రూపంలో ఏకంగా రూ.15,485 కోట్ల భారాన్ని మోపారని వైసిపి జిల్లా అధ్యక్షులు మజ్జి శ్రీనివాసరావు తెలిపారు. కరెంటు ఛార్జీల బాదుడుపై ఈ నెల 27న వైసిపి పోరుబాట కార్యక్రమాన్ని చేపడుతున్నట్లు వివరించారు. మంగళవారం నగరంలోని వైసిపి జిల్లా కార్యాలయంలో పోరుబాట పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మీడియాతో ఆయన మాట్లాడుతూ ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేయడంలో చంద్రబాబు విఫలమయ్యారని విమర్శించారు. ఇప్పటికే నిత్యావసర వస్తువుల ధరలు భారీగా పెరిగాయన్నారు. వైసిపి పాలనలో కరెంట్ ఛార్జీలు పెంచారంటూ, తామొస్తే తగ్గిస్తామంటూ ఎన్నికల సమయంలో చంద్రబాబు పదేపదే ప్రచారం చేశారని గుర్తుచేశారు. తీరా అధికారంలోకి వచ్చాక రూ.15,485 కోట్ల విద్యుత్తు ఛార్జీల భారాన్ని ప్రజలపై మోపారని దుయ్యబట్టారు. పెరిగిన విద్యుత్తు ఛార్జీలతో సామాన్యులే కాకుండా కుటీర, మధ్య తరహా పరిశ్రమలు నష్టపోయే అవకాశం ఉందన్నారు. రైతుల సమస్యలపై ఈ నెల 13న వైసిపి ఉద్యమించిన తర్వాతే ప్రభుత్వంలో కదలిక వచ్చిందన్నారు. ఈ నెల 27న జిల్లాలోని అన్ని నియోజకవర్గ కేంద్రాల్లో కరెంట్ ఛార్జీల బాదుడుపై ర్యాలీలు నిర్వహిస్తున్నామని చెప్పారు. అనంతరం విద్యుత్తు శాఖాధికారులకు వినతులు అందిస్తామని తెలిపారు. ప్రజలను భాగస్వామ్యం చేసుకుని పార్టీ శ్రేణులు ముందుకు కదలాలని పిలుపునిచ్చారు. 27న చేపట్టే నిరసన ర్యాలీలను విజయవంతం చేయాలని కోరారు. ఈ సందర్భంగా ఉమ్మడి విజయనగరం జిల్లా ప్రజలకు క్రిస్మస్ శుభాకాంక్షలు తెలియజేశారు. సమావేశంలో వైసిపి నాయకులు పాల్గొన్నారు.

రైతులను సకాలంలో ఆదుకోవాలి

- వెంటనే టార్పాలిన్లు అందించాలి
- జెడ్‌పి చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు
- స్థాయీ సంఘ సమావేశాల్లో పలు అంశాలపై చర్చ

ప్రజాశక్తి-విజయనగరం

వర్షాలతో నష్టపోయిన రైతులను ప్రభుత్వం సకాలంలో ఆదుకోవాలని, తడిచిన ధాన్యాన్ని ఆరబెట్టేందుకు అవసరమైన టార్పాలిన్లను వెంటనే అందించాలని ఉమ్మడి జిల్లాల వ్యవసాయాధికారులను జిల్లా పరిషత్తు చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు కోరారు. స్థాయీ సంఘ సమావేశాలను జెడ్‌పి సమావేశ మందిరంలో మంగళవారం నిర్వహించారు. 1, 2, 4, 7వ స్థాయీ సంఘ సమావేశాలు జెడ్‌పి చైర్మన్ శ్రీనివాసరావు అధ్యక్షతన, 3వ స్థాయీ సంఘ సమావేశం వైస్ చైర్మన్ బాపూజీనాయుడు అధ్యక్షతన, 6వ స్థాయీ సంఘ సమావేశం ఆ సంఘ చైర్మన్ కొర్రజెన్ని సింహాచలం అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా సంఘాల్లోని వివిధ శాఖలకు సంబంధించిన అంశాలపై చర్చించారు.

ఎమ్మెల్సీ పెనుమత్స సురేష్‌బాబు మాట్లాడుతూ తడిచిన ధాన్యం ఆరబెట్టేందుకు ఎన్ని టార్పాలిన్లు సరఫరా చేశారని వ్యవసాయాధికారులను ప్రశ్నించారు. విజయనగరం జిల్లాలో ఇప్పటివరకు 1400 టార్పాలిన్లు సరఫరా చేశామని, ఇంకా 1600 టార్పాలిన్లు పంపిణీ చేయాల్సి ఉందని జిల్లా వ్యవసాయాధికారి వి.టి.రామారావు చెప్పారు. మన్యం జిల్లాలో ఇప్పటివరకు 1570 టార్పాలిన్లు సరఫరా చేసినట్లు ఆ జిల్లా వ్యవసాయాధికారి తెలిపారు. ఈ సందర్భంగా జెడ్‌పి చైర్మన్ శ్రీనివాసరావు మాట్లాడుతూ ఏయే మండలానికి ఎన్ని టార్పాలిన్లు సరఫరా చేశారో సంబంధిత వాట్సాప్ గ్రూప్‌లో పెట్టాలని, దానివల్ల పూర్తి సమాచారం అందుతుందని సూచించారు.

కొర్రజెన్ని సింహాచలం అధ్యక్షతన జరిగిన ఆరో స్థాయి సమావేశంలో సాంఘిక సంక్షేమ, వెనుకబడిన సంక్షేమ శాఖలతోపాటు విదేశీ విద్యపై చర్చించారు. గార తవుడు, మామిడి శ్రీనివాసరావు మాట్లాడుతూ గ్రామస్థాయిలో తీర్మానాలు లేకుండానే గోశాలలు కట్టడానికి అనుమతిస్తున్నారని చెప్పారు. గ్రామస్థాయి తీర్మానాలు లేకుండా వీటికి అనుమతిస్తే చట్టపరమైన సమస్యలు వస్తాయని అధికారులకు చైర్మన్ శ్రీనివాసరావు సూచించారు. జలజీవన్ మిషన్‌లో అమలయ్యే పనులకు ఈ నెలాఖరులోగా ఎం-బుక్‌లను పూర్తిచేసి పంపించాలని ఆర్‌డబ్ల్యుఎస్ అధికారులను ఆదేశించారు. స్థాయీ సంఘ సమావేశంలో చర్చకు వచ్చిన అంశాలకు సంబంధించి పూర్తి నివేదికలతో రానున్న జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశానికి హాజరుకావాలని చైర్మన్ కోరారు. ఈ సమావేశాల్లో జెడ్‌పి సిఇఒ బివి సత్యనారాయణ, ఆయా సంఘాల సభ్యులు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న జెడ్‌పి చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు

అమిత్‌షాపై చర్యలు తీసుకోవాలని నిరసన

ప్రజాశక్తి-విజయనగరంకోట

బిఆర్ అంబేద్కర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసిన కేంద్రమంత్రి అమిత్‌షాపై చర్యలు తీసుకోవాలని బిఎస్‌పి ఆధ్వర్యాన నగరంలోని అంబేద్కర్ జంక్షన్‌లో మంగళవారం నిరసన చేపట్టారు. అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం విగ్రహానికి వినతి అందించారు. ఈ సందర్భంగా బిఎస్‌పి రాష్ట్ర కార్యదర్శి సోము రాంబాబు మాట్లాడుతూ దేశభక్తికి, దైవభక్తికి తేడా తెలియని అమిత్‌షా లాంటి వ్యక్తి కేంద్ర హోంమంత్రిగా అనర్హులన్నారు. మంత్రి పదవి నుంచి తొలగించాలని కేంద్రాన్ని డిమాండ్‌చేశారు.

అమల్లోకి కార్పొరేషన్ లోగో

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

విజయనగరం నగరపాలక సంస్థగా అవతరించాక, ఇన్నాళ్లకు అధికార చిహ్నం ప్రకటించారు. నగర ఔన్నత్యాన్ని ప్రతిబింబించే విధంగా రూపొందిన లోగోను ఇటీవల కౌన్సిల్ తీర్మానిస్తూ ఆమోదించిన విషయం విదితమే. ఈ లోగోను మంగళవారం కౌన్సిల్ హాల్, మేయర్, కమిషనర్, డిప్యూటీ మేయర్ల ఛాంబర్లలో ఏర్పాటు చేశారు.

కమిషనర్ కార్యాలయంలో ఏర్పాటుచేసిన కార్పొరేషన్ లోగో

ఇంటి వివరాలతో స్టిక్కర్లు

విజయనగరం టౌన్ : నగరపాలక సంస్థ పరిధిలోని ప్రతి నివాసానికీ ఆయా ఇంటి వివరాలతో కూడిన స్టిక్కర్లను ప్రణాళికా సిబ్బంది అతికిస్తున్నారు. రీ సర్వేలో భాగంగా గుర్తించిన ఆస్తి వివరాలు, వాటి యజమానుల పేర్లతో డోర్ నంబర్లను పొందుపరిచారు. ఈ మేరకు ప్రణాళిక సిబ్బంది, కార్యదర్శులు ఇంటింటికి వెళ్లి ఆయా వివరాలతో కూడిన స్టిక్కర్లను అతికిస్తున్నారు.

పేకాట, కోడి పందేలపై విస్తృతంగా దాడులు

పోలీసు అధికారులకు ఎస్‌పి ఆదేశం

ప్రజాశక్తి-విజయనగరంకోట

పేకాట, కోడి పందేలపై దాడులు విస్తృతం చేయాలని ఎస్‌పి వకుల్ జిందాల్.. పోలీసు అధికారులను ఆదేశించారు. మంగళవారం జిల్లా పోలీసు కార్యాలయంలో పోలీసు అధికారులతో మాసాంతర నేర సమీక్షా సమావేశాన్ని ఎస్‌పి నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్‌పి మాట్లాడుతూ సంక్రాంతి పండగ నేపథ్యంలో పేకాట, కోడి పందేలు జరగకుండా చూడాలనిన్నారు. ముందస్తుగా సమాచారం సేకరించి, దాడులు నిర్వహించాలని ఆదేశించారు. గంజాయి అక్రమ రవాణా నియంత్రణలో కఠినంగా వ్యవహరించాలని సూచించారు. నేరాలను నియంత్రించేందుకు పగలు, రాత్రి బీట్లు వేయాలన్నారు. రాత్రి సమయాల్లో అనుమానాస్పదంగా తిరిగే వ్యక్తుల వేలిముద్రలను పాపిలాన్ స్కానర్స్‌లో నిక్షిప్తం చేయాలని, వారి నేర చరిత్రను పరిశీలించాలని ఆదేశించారు. రాత్రి 11గంటల తరువాత సహేతుకరమైన కారణం లేకుండా తిరిగే వారిపై కేసులు నమోదు చేయాలన్నారు. డాబాల్లో మద్యం సరఫరా జరగకుండా చూడాలని, ఎవరైనా మద్యం సరఫరా చేస్తే వారిపై ఎన్‌ఫోర్స్‌మెంటు కేసులు నమోదు చేయాలని చెప్పారు. విధి నిర్వహణలో ప్రతిభ కనబర్చిన పోలీసు అధికారులు, సిబ్బందికి ప్రశంసా పత్రాలను ప్రదానం చేశారు. ఈ సమావేశంలో అదనపు ఎస్‌పి పి.సౌమ్యలత, విజయనగరం, బొబ్బిలి డిఎస్‌పిలు ఎం.శ్రీనివాసరావు, పి.శ్రీనివాసరావు, న్యాయ సలహాదారులు వై.పరశురాం, పలువురు సిఐలు, ఆర్‌ఐలు, తదితరులు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న ఎస్‌పి వకుల్ జిందాల్

కబడ్డీ పోటీలు ప్రారంభం

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

కబడ్డీ క్రీడకు విజయనగరంలో పూర్వ వైభవాన్ని తీసుకువచ్చేందుకు కృషి చేస్తానని జనసేన నాయకులు అవనాపు విక్రమ్ అన్నారు. భగవాన్ దాస్ మాస్టారు జయంతి సందర్భంగా మంగళవారం నగరంలోని కస్పా హైస్కూల్లో దాస్ మాస్టారు అభిమానులు, శిష్యులు నిర్వహించిన జిల్లా స్థాయి బాలల కబడ్డీ పోటీలను ఆయన ప్రారంభించారు. ముందుగా భగవాన్ దాస్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ భగవాన్ దాస్‌తోపాటు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ కబడ్డీ అసోషియేషన్ చైర్మన్‌గా తన తండ్రి, కీర్తిశేషులు అవనాపు సూరిబాబు అందించిన సేవలను గుర్తుచేసుకున్నారు. వారిద్దరి సారథ్యంలో కబడ్డీ క్రీడలో విజయనగరం జిల్లాకు జాతీయ స్థాయిలో గుర్తింపు లభించిందని తెలిపారు. కార్యక్రమంలో వ్యాయామ ఉపాధ్యాయులు శ్రీనివాసరావు, చిన్నంనాయుడు, చిట్టిరాజు, టి.ఎల్.పి రాజు, కబడ్డీ సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

టాస్ వేసి కబడ్డీ పోటీలను ప్రారంభిస్తున్న అవనాపు విక్రమ్



ధర్నా పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న మున్సిపల్ వర్కర్స్, హెల్పర్స్ ఫెడరేషన్ నాయకులు

26న మున్సిపల్ కార్యాలయాల వద్ద ధర్నాలు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

మున్సిపల్ కార్మికుల సమ్మె ఒప్పందాలు అమలు చేయాలని ఈ నెల 26న అన్ని మున్సిపల్ కార్యాలయాల వద్ద ధర్నాలు చేపడుతున్నట్లు ఎపి మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ ఫెడరేషన్ రాష్ట్ర నాయకులు ఎ.జగన్మోహనరావు తెలిపారు. మంగళవారం స్థానిక ఎల్‌బిజి భవనంలో ధర్నా వాల్‌పోస్టర్‌ను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మున్సిపల్ కార్మికులకు బేసిక్ వేతనాలు అమలు, ఉద్యోగ భద్రత, రిటైర్మెంట్ బెనిఫిట్స్, రక్షణ పరికరాలు, పనిముట్లు, కార్మికుల సంఖ్య పెంపు, మరణించిన, రిటైర్ అయిన వారి పిల్లలకు ఉద్యోగాలు, ఇఎస్‌ఐ, పిఎఫ్ సమస్యలు పరిష్కరించాలని సిఐటియు ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్తంగా 16 రోజులు సమ్మె చేసినట్లు గుర్తుచేశారు. కార్మికులకు రూ.21 వేలు, డ్రైవర్లకు రూ.24,500 బేసిక్ వేతనాలు సాధించుకున్నామని తెలిపారు. సమ్మె ప్రారంభమై డిసెంబర్ 26 తేదికి ఏడాది పూర్తయినా, హామీలు అమలు చేయలేదని చెప్పారు. ఇంజినీరింగ్, నాన్ పిహెచ్ వర్కర్ల వేతనాలను పెంచలేదన్నారు. సమ్మె కాలపు హామీలను అమలు చేయడంతోపాటు ఇఎస్‌ఐ, పిఎఫ్ అమలు చేయాలని, పట్టణ జనాభా విస్తరణకు అనుగుణంగా కార్మికుల సంఖ్యను పెంచాలని 26న ధర్నా చేపడుతున్నట్లు వెల్లడించారు. ధర్నాలకు పెద్ద ఎత్తున కార్మికులు హాజరై, విజయవంతం చేయాలని కోరారు. సమావేశంలో ఎపి మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ ఫెడరేషన్ నాయకులు బి.రమణ, ఎస్.రామినాయుడు, చందక భాస్కరరావు, ఎ.రాఘవ పాల్గొన్నారు.

కబడ్డీలో సత్తాచాటిన 'సత్య' విద్యార్థి

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

సత్య డిగ్రీ, పీజీ కళాశాలలో బిఎ మొదటి సంవత్సరం చదువుతున్న విద్యార్థిని బి.నీలిమ రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీల్లో సత్తాచాటింది. ఇటీవల ప్రకాశం జిల్లా సంతనూతలపాడులో జరిగిన 71వ ఆంధ్ర సీనియర్ పురుషులు, మహిళల కబడ్డీ ఛాంపియన్‌షిప్‌లో విజయనగరం జట్టు నుంచి ప్రాతినిధ్యం వహించి, ద్వితీయ స్థానం సంపాదించింది. ఈ సందర్భంగా కళాశాల డైరెక్టర్ డాక్టర్ ఎం.శశిభూషణ రావు, ప్రిన్సిపల్ డాక్టర్ ఎం.వి.సాయి దేవ మణి, ఎన్‌సిసి ఆఫీసర్ కెప్టెన్ ఎం.సత్యవేణి, పీడీ ఎస్‌హెచ్‌హెచ్ ప్రసాద్... నీలిమను అభినందించారు.

హక్కులను తెలుసుకోవాలి

జాయింట్ కలెక్టర్ ఎస్.సేతు మాధవన్ ● ఘనంగా జాతీయ వినియోగదారుల దినోత్సవం

ప్రజాశక్తి-విజయనగరంకోట

ప్రస్తుతం ప్రపంచాన్ని శాసిస్తున్నది వినియోగదారుడేనని జాయింట్ కలెక్టర్ ఎస్.సేతు మాధవన్ అన్నారు. వినియోగదారులంతా తమ హక్కులను తెలుసుకోవాలని సూచించారు. జిల్లా పౌర సరఫరాల శాఖ ఆధ్వర్యంలో జాతీయ వినియోగదారుల దినోత్సవ వేడుకలు కలెక్టరేట్ ఆడిటోరియంలో మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జెసి మాట్లాడుతూ కొనుగోలు చేసే వస్తు, సేవలకు పూర్తిగా సంతృప్తి చెందాల్సి ఉందన్నారు. అలా సంతృప్తి చెందకపోతే, న్యాయస్థానాన్ని ఆశ్రయించి న్యాయం పొందే హక్కు ఉందని చెప్పారు. విక్రయించే వస్తువు గురించి పూర్తి సమాచారాన్ని అందజేయాల్సిన బాధ్యత తయారీదారుడిపై ఉందని స్పష్టం చేశారు. కొనుగోలు చేసేముందు వాటిని వినియోగదారులు పూర్తిగా తెలుసుకోవాలని సూచించారు. జిల్లా వినియోగదారుల కమిషన్ అధ్యక్షులు, న్యాయమూర్తి ఆర్.వెంకట నాగ సుందర్ మాట్లాడుతూ వినియోగదారుల హక్కుల గురించి వివరించారు. జిల్లా కమిషన్ పరిధిలో సుమారు రూ.50 లక్షల వరకు విలువైన వ్యాజ్యాలను వేసే అవకాశం ఉందన్నారు. బ్యాంకింగ్, ఫైనాన్స్, ఇన్సూరెన్స్, నిర్మాణం, రవాణా, గ్యాస్, విద్యుత్ తదితర రంగాలకు చెందిన సేవా లోపాలపై తమ కమిషన్‌ను ఆశ్రయించవచ్చునని సూచించారు.

మేలుకొలుపు మాసపత్రికను ఆవిష్కరిస్తున్న జెసి సేతు మాధవన్

అనంతరం జిల్లా వినియోగదారుల కమిషన్ సభ్యులు బి.శ్రీదేవి, సైబర్ క్రైమ్ ఎస్‌ఐ ప్రశాంత్‌కుమార్, ఐఒసి సేల్స్ ఆఫీసర్ యోగేష్‌కుమార్, జిల్లా ఔషధ నియంత్రణశాఖ ఎడి రజిత, జిల్లా ఆహార భద్రతాధికారి వెంకటరమణ, సిడిపిఒ ప్రసన్న, తూనికలు, కొలతల శాఖ డిసి దామోదరనాయుడు, వాణిజ్యపన్నుల శాఖ జాయింట్ కమిషనర్ సురేష్, ఆసరా జాయింట్ సెక్రటరీ ఎం.చంద్రశేఖర్, డిసిఐసి జిల్లా కార్యదర్శి ఎస్.కామేశ్వరరావు మాట్లాడారు. పాఠశాల, కళాశాల విద్యార్థులకు నిర్వహించిన వ్యాసరచన, వక్తృత్వ పోటీల విజేతలకు బహుమతులు అందజేశారు. మేలుకొలుపు మాస పత్రికను ఆవిష్కరించారు. వినియోగదారులకు అవగాహన కల్పించేందుకు ఏర్పాటు చేసిన స్టాల్స్‌ను తిలకించారు.

సరుగుడు కర్రల వేలం పూర్తి

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

నగరపాలక సంస్థ పరిధిలో అనధికార ఫ్లెక్సీల ఏర్పాటుకు ఉంచిన సరుగుడు కర్రలను స్వాధీన పరుచుకున్న అధికారులు మంగళవారం బహిరంగ వేలం ద్వారా విక్రయించారు. సుమారుగా 8 టన్నుల కలపకు సహాయ కమిషనర్ సిహెచ్.తిరుమలరావు ఛాంబర్‌లో వేలం నిర్వహించగా, ముగ్గురు పాల్గొన్నారు. టన్ను కర్రలను రూ.3,550 చొప్పున దాసరి వరాహ నూకరాజు వేలంలో కైవశం చేసుకున్నారు. కార్యక్రమంలో రెవెన్యూ సిబ్బంది అప్పలరాజు పాల్గొన్నారు.

1492 ఇళ్ల నిర్మాణాలు పూర్తికావాలి

కలెక్టర్ బి.ఆర్.అంబేద్కర్

ప్రజాశక్తి-విజయనగరంకోట

రాష్ట్ర వ్యాప్తంగా వచ్చే జనవరి మొదటి వారంలో లక్ష ఇళ్లలో సామూహిక గృహప్రవేశాలు చేయాలని ప్రభుత్వం లక్ష్యంగా నిర్ణయించిందని కలెక్టర్ బిఆర్ అంబేద్కర్ తెలిపారు. అందులో జిల్లాలో ఈ నెలాఖరికి 4816 ఇళ్ల నిర్మాణాన్ని పూర్తిచేయాలని లక్ష్యంగా నిర్దేశించినట్లు చెప్పారు. ఇప్పటికే 3,324 ఇళ్ల నిర్మాణాన్ని పూర్తిచేశామని, మిగిలిన 1492 గృహాలను వారం రోజుల్లోగా పూర్తిచేయాలని గృహనిర్మాణ సంస్థ అధికారులను ఆదేశించారు. జిల్లాలోని గృహనిర్మాణ సంస్థ ఇఇ, డిఇ, ఎఇలతో కలెక్టర్ మంగళవారం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా గృహనిర్మాణంపై సమీక్షించారు. 1492 ఇళ్లు కూడా శ్లాబ్ దశను దాటి పూర్తయ్యాయని, వాటిని పూర్తిచేయించి ఆన్‌లైన్‌లో సమాచారాన్ని అప్‌లోడ్ చేయించాలని కలెక్టర్ సూచించారు. సమావేశంలో గృహనిర్మాణ సంస్థ ప్రాజెక్టు డైరెక్టర్ కూర్మినాయుడు, ఇఇ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ఎస్ఐ ప్రసాద్‌కు ఎస్‌పి ప్రశంస

ప్రశంసా పత్రాన్ని అందుకుంటున్న ఎస్ఐ

రామభద్రపురం: స్థానిక ఎస్ఐ వెలమల ప్రసాదరావుకు జిల్లా ఎస్‌పి వకుల్ జిందాల్ ప్రశంసా పత్రాన్ని అందజేశారు. మంగళవారం జిల్లా పోలీసు కార్యాలయంలో జరిగిన సమావేశంలో అనతి కాలంలోనే మెరుగైన పనితీరు కనబరిచి విధులు అప్రమత్తంగా నిర్వహిస్తూ జిల్లాలో ఫ్రెండ్లీ పోలీసింగ్ విధానాలు అమలు చేస్తున్న ఆయన సేవలను గుర్తించి ప్రశంసా పత్రాన్ని అందించారు. గంజాయి పట్టివేతలో పూర్తి సహాయ సహకారాలు అందజేసిన ఇదే స్టేషన్ కానిస్టేబుల్ బాలి విశ్వేశ్వరరావును కూడా ఎస్‌పి అభినందించి ప్రశంసా పత్రాన్ని అందించారు. ఈ సందర్భంగా ఎస్ఐ ప్రసాదరావు మాట్లాడుతూ ఈ ప్రశంస దక్కడం ఆనందంగా ఉందని, మరింత బాధ్యతగా విధులు నిర్వహించి శాంతి భద్రతల రక్షణకు కృషి చేస్తానన్నారు.

క్షయ రహిత సమాజాన్ని నిర్మిద్దాం

రేగిడి: క్షయ రహిత సమాజాన్ని నిర్మించుకుందామని, అందుకు ప్రజలంతా సహకరించాలని వంద రోజుల క్షయ వ్యాధి నిర్మూలన వైద్యాధికారులు డాక్టర్ చలమయ్య, రీనా చౌదరి కోరారు. కొండవలస, కోడిస గ్రామాల్లో క్షయ వ్యాధి కరపత్రాలను మంగళవారం పంచి ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ క్షయ వ్యాధి లక్షణాలు ఉన్నవారు కఫం పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపిహెచ్ఇఒ రాధాకృష్ణ, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

శృంగవరపుకోట: క్షయ వ్యాధి నిర్మూలనకు అందరం కృషి చేద్దామని డాక్టర్ శిరీష, ఎంపిహెచ్ఒ నాయుడు అన్నారు. వందరోజుల టిబి శిబిరం నిర్వహణ కార్యక్రమంలో భాగంగా పట్టణంలోని రెండు హెల్త్ అండ్ వెల్నెస్ సెంటర్లలో మంగళవారం అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. టిబి వ్యాధి లక్షణాలు వ్యాప్తి చెందిన విధానం, నివారణ చర్యల గూర్చి స్థానిక ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో సూపర్వైజర్ బీజీ శ్రీనివాసరావు, ఎంపిటిసి, అంగన్వాడిలు, మెడికల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

మొక్కజొన్నను పరిశీలించిన శాస్త్రవేత్తలు

డెంకాడ: తుఫాను కారణంగా దెబ్బతిన్న మొక్కజొన్న పంటలను వ్యవసాయ శాఖ సిబ్బంది, శాస్త్రవేత్తల బృంద సభ్యులు మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఏరువాక కేంద్రం శాస్త్రవేత్తలు కె. లక్ష్మణరావు, వ్యవసాయ శాఖ ఎడి ఎ.నాగభూషణరావు మాట్లాడుతూ గత వారం రోజులుగా కురుస్తున్న వర్షాలకు 15 నుంచి 20 రోజుల వయస్సు ఉన్న మొక్కజొన్న పంట నీట మునిగిందని త్వరితగతిన కోలుకోవడానికి రైతుల తప్పనిసరిగా వర్షం నీటిని బయటికి పంపించే విధంగా బాటలు తీసుకోవాలని చెప్పారు. 40 కేజీల యూరియా, 20 కేజీల మ్యూరేట్ ఆఫ్ పొటాష్ వేసుకోవాలన్నారు. డిసెంబర్ నెల ఆఖరి పంటల బీమా ప్రీమియం చెల్లించడానికి వీలుందని రైతులు వినియోగించుకోవాలని కోరారు. కార్యక్రమంలో వ్యవసాయ అధికారులు రైతులు పాల్గొన్నారు.

అమిత్‌షాను బర్తరఫ్ చేయాలి

నెల్లిమర్ల: రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బిఆర్ అంబేద్కర్ పై కేంద్ర మంత్రి అమిత్ షా చేసిన వ్యాఖ్యలకు ఆయన్ను బర్తరఫ్ చేయాలని జై భీం రావు భారత్ పార్టీ నాయకులు కనిగిరి శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. మంగళవారం గుషిణిలో దళితుల ఆధ్వర్యంలో కేంద్ర మంత్రి వ్యాఖ్యలపై అంబేద్కర్ విగ్రహానికి వినతి పత్రం ఇచ్చి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాజ్యాంగ నిర్మాత అంబేద్కర్‌పై కేంద్ర మంత్రి అమిత్ షా చేసిన వ్యాఖ్యలు వెంటనే ఉపశమహరించుకొని క్షమాపణ చెప్పాలన్నారు. ఈ కార్యక్రమంలో దళితులు బి. దిలీప్, వై. త్రినాధ్, మనోహర్, శివ తదితరులు పాల్గొన్నారు.

వల్లంపూడి, వేపాడలో రెవెన్యూ సదస్సులు

వేపాడ: వేపాడ, వల్లంపూడి గ్రామ సచివాలయాల వద్ద మంగళవారం రెవెన్యూ సదస్సులను నిర్వహించారు. రెవెన్యూ సదస్సుల ద్వారా రైతులకు కలిగే ప్రయోజనాలను ర్యాలీ రూపంలో రైతులకు వివరించారు. అనంతరం రైతుల వద్ద నుంచి అర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా తహశీల్దార్ జె.రాములమ్మ మాట్లాడుతూ రైతులు దళారులను నమ్మి మోసపోవద్దని గ్రామ రెవెన్యూ సదస్సులో రైతుల పెట్టుకున్న దరఖాస్తులకు ఏ విధమైన రుసుమూ తీసుకోమని చెప్పారు. నిర్భయంగా రైతులు భూములకు సంబంధించిన వివరాలతో కూడిన దరఖాస్తులను తమకు అందజేయాలని కోరారు. అనంతరం వల్లంపూడిలో ఆరు, వేపాడలో 11 దరఖాస్తులు స్వీకరించినట్లు ఆమె తెలిపారు. ఈ కార్యక్రమంలో వేపాడ, వల్లంపూడి సర్పంచులు, ఎంపిటిసిలు, గ్రామ రెవెన్యూ అధికారులు, మండల సర్వేయరు, పంచాయతీ కార్యదర్శులు రైతులు పాల్గొన్నారు.

రోలర్ స్కేటింగ్‌లో బంగారు పతకం

భోగాపురం: మండలంలోని గూడెపువలస ఆర్అండ్ఆర్ కాలనీ బొల్లింకల పాలెం గ్రామానికి చెందిన బొల్లింకల రోహిత్ రెడ్డి రోలర్ స్కేటింగ్ లో బంగారు పతకం సాధించాడు. ఇటీవలి తమిళనాడు రాష్ట్రం పొల్లాచిలో 62వ జాతీయ రోలర్ స్కేటింగ్ పోటీలు జరిగాయి. ఈ పోటీల్లో లోహిత్ రెడ్డి పథకం సాధించాడని తండ్రి అప్పన్న తెలిపాడు. ఈ సందర్భంగా విశాఖ ఎమ్‌పి భరత్ లోహిత్ రెడ్డిని అభినందించారు. రాబోయే అంతర్జాతీయ పోటీలకు ఎంపికై దేశానికి మంచి పేరు తేవాలని సూచించారు. కోచ్‌లు పి సత్యనారాయణ, చిట్టిబాబులను కూడా అయన అభినందించారు.

అరవింద్‌కు ద్వితీయ స్థానం

వేపాడ: మండలంలోని బక్కునాయుడుపేట ఎపి ఆదర్శపాఠశాలలో చదువుతున్న అరవింద్ వక్తృత్వ పోటీల్లో జిల్లా స్థాయిలో ద్వితీయ స్థానం సాధించాడు. జిల్లా కేంద్రంలోని సాంస్కృతిక పాఠశాలలో జాతీయ వినియోగదారుల దినోత్సవం సందర్భంగా పౌర సరఫరాల శాఖ 'వినియోగదారు న్యాయపాలనకు పర్చువల్ విచారణలు, డిజిటల్ సౌలభ్యం' అనే విషయంపై నిర్వహించిన వక్తృత్వ పోటీల్లో ద్వితీయ స్థానం సాధించాడు. ఇందులో భాగంగా మంగళవారం కలెక్టర్ ఆడిటోరియంలో అరవింద్ కలెక్టర్ బిఆర్ అంబేద్కర్, విద్యాశాఖ అధికారి చేతుల మీదుగా ప్రశంసా పత్రం, నగదు అందుకున్నట్లు ప్రిన్సిపల్ రావాడ ఏసురావు తెలిపారు. అరవింద్‌ను పాఠశాల ఉపాధ్యాయులు తదితరులు అభినందించారు.

డిపాజిట్లపై అవగాహన ఉండాలి

ప్రజాశక్తి - గుర్ల

బ్యాంకు ఖాతాదారులు తమతమ డిపాజిట్లు ఖాతాపై పూర్తి అవగాహన కలిగి ఉండాల్సిన ఆవశ్యకత ఉందని జిల్లా లీడ్ మేనేజర్ రమణ మూర్తి అన్నారు. మంగళవారం స్థానిక ఎంపిడిఒ కార్యాలయం సమావేశ భవనంలో రిజర్వ్ బ్యాంకు ఆఫ్ ఇండియా, డిపాజిటర్, ఎడ్యుకేషన్ అండ్ అవేర్నెస్ వర్క్‌షాప్‌ను నిర్వహించారు. ఖాతాదారులు డిపాజిట్ల గురించి తెలుసుకోవాలన్నారు. ప్రస్తుత కాలంలో డిజిటల్ లావాదేవీలు, సైబర్ మోసాలు గురించి తెలుసుకొని అప్రమత్తంగా ఉండాలన్నారు. ప్రతి ఒక్కరు బ్యాంక్ ఫోల్డర్‌లో చేర్చాలని, ఆర్థిక అక్షరాస్యత కలిగి ఉండాలని ఏపీవిబి బ్యాంక్ అధికారి రాంప్రసాద్ తెలిపారు. సొసైటీ ఫర్ సోషల్ ట్రాన్స్ఫర్మేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన వర్క్‌షాప్‌లో వెలుగు ఎపిఎం భారతి, ప్రోగ్రాం కోర్డినేటర్ సూరిబాబు తదితరులు పాల్గొన్నారు.

గుండెపోటుతో ఉపాధి ఉద్యోగి మృతి

ప్రజాశక్తి - పూసపాటిరేగ

స్థానిక ఉపాధి హామీ కార్యాలయంలో పనిచేస్తున్న కంప్యూటర్ ఆపరేటర్ కోన శంకర్ సోమవారం రాత్రి గుండుపోటుతో మృతి చెందాడు. ఎప్పటిలాగే సోమవారం కార్యాలయంలో తన విధులు ముగించుకొని తన స్వగ్రామమైన చీపురుపల్లి వెళ్లారు. సోమవారం రాత్రి స్వల్ప గుండె నొప్పి రావడంతో వెంటనే చికిత్స నిమిత్తం విజయనగరం ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యంలో మృతి చెందినట్లు కుటుంబీకులు చెప్తున్నారు. మృతునికి భార్య నాగమణితో పాటు తల్లి అన్నదమ్ములు ఉన్నారు. చీపురుపల్లికి చెందిన శంకర్ విజయనగరంలో తన అత్తవారింటి దగ్గర ఉంటూ పూసపాటిరేగలో ఉద్యోగం చేస్తున్నాడు. శంకర్ మృతికి పని ఒత్తిడే కారణమని కుటుంబీకులతో పాటు బంధువులు స్నేహితులు ఆరోపిస్తున్నారు. విషయం తెలుసుకున్న జిల్లా కేంద్రంలోని ఎన్ఆర్ఇజిఎస్ సిబ్బంది పూసపాటిరేగ మండల ఉపాధి ఉద్యోగులు, ఫీల్డ్ అసిస్టెంట్లు మృతదేహానికి నివాళులర్పించి కుటుంబానికి ప్రగాఢ సానుభూతిని తెలిపారు. మంగళవారం చీపురుపల్లి శ్మశాన వాటికలో కుటుంబీకులు అంత్యక్రియలు నిర్వహించారు.

80 మద్యం బాటిళ్ల పట్టివేత

ప్రజాశక్తి- బొబ్బిలి

పట్టణంలోని ఒక మద్యం దుకాణం నుంచి గ్రామాలకు అనుమతులు లేకుండా మద్యం బాటిళ్లను తరలిస్తున్న వ్యక్తిని ముందస్తు సమాచారం మేరకు ఎస్ఐ ఆర్ రమేష్ మంగళవారం దాడి చేసి పట్టుకున్నారు. అనుమతులు లేకుండా రవాణా చేస్తున్న 80 మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నారు. ఈ దాడుల్లో వ్యక్తిని అరెస్టు చేసి అతని వాహనాన్ని సీజ్ చేసి, సదరు వ్యక్తిని రిమాండ్‌కు పంపించినట్లు ఎస్ఐ తెలినారు.

భూ అమ్మకంపై సమగ్ర దర్యాప్తు జరపాలి

- సిపిఎం జిల్లా కార్యదర్శి తమ్మినేని సూర్యనారాయణ డిమాండ్
- ఎస్‌సి, ఎస్‌టి రైతుల భూములు, చెట్ల నరికివేత పరిశీలన

ప్రజాశక్తి - వేపాడ

చామలపల్లి గ్రామ దళితులకు ఎస్‌సి కార్పొరేషన్ ద్వారా పొందిన భూ అమ్మకాలపై సమగ్ర దర్యాప్తు జరిపి దళితులకు న్యాయం చేయాలని సిపిఎం జిల్లా కార్యదర్శి తమ్మినేని సూర్యనారాయణ డిమాండ్ చేశారు. మంగళవారం మండలంలోని చామలపల్లి గ్రామంలోని దళితులకు కొనుగోలు చేసి అప్పగించిన 24 ఎకరాల భూములను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా తమ్మినేని మాట్లాడుతూ ఎస్‌సి కార్పొరేషన్ ద్వారా దళితులకు ప్రభుత్వం భూమి అప్పగించిన కొంతకాలం తర్వాత దళితులను మోసం చేసి, బెదిరించి కొంత మంది ఆ భూములను కొనుగోలు చేశారన్నారు. చట్టం ప్రకారం ప్రభుత్వం కొనుగోలు చేసి దళితులకు ఇచ్చిన భూమిని అమ్మడానికి, కొనడానికి వీలు లేదన్నారు. కానీ ఎస్‌సి కార్పొరేషన్ ద్వారా తీసుకున్న రుణాలను కట్టేందుకు

భూములను పరిశీలిస్తున్న సిపిఎం నాయకులు

భూములను అమ్మాలని దళారులు మోసం చేసి ఆ భూములను వేరే పెద్దల ద్వారా రిజిస్ట్రేషన్ కూడా చేయించడం అన్యాయమన్నారు. దళితులకు జరిగిన అన్యాయంపై సమగ్ర దర్యాప్తు నిర్వహించి దోసులను శిక్షించాలని, ఆ భూములను తిరిగి చామలాపల్లి గ్రామంలో ఉన్న దళితులకు అప్పగించాలని డిమాండ్ చేశారు. కాగా అదే భూముల్లో ఉన్న సుమారు 40 టేకు చెట్లను అక్రమంగా పెద్దలు నరికి అమ్మేసుకున్నా ఎటువంటి చర్యలు తీసుకోకపోవడం దుర్మార్గమన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి దళితులకు దూరమైన భూమిని తిరిగి వారికి అప్పగించాలని ఎటువంటి అనుమతులు లేకుండా విలువైన టేకు చెట్లను మాయం చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని కోరారు. దళితులకు న్యాయం జరగని పక్షంలో జనవరి 2 నుంచి నియోజకవర్గంలో ఉన్న దళితులను, పేదలను సమీకరించి దళితులకు న్యాయం జరిగే వరకు పోరాటం ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎపి రైతు సంఘం జిల్లా ఉప అధ్యక్షులు చల్లా జగన్, సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు జి అప్పారావు, సామాజిక కార్యకర్త రిక్కీ అప్పారావు తదితరులు పాల్గొన్నారు.


సిఎంకు సమస్యలను వివరిస్తున్న కర్రోతు

సిఎంను కలిసిన కర్రోతు

ప్రజాశక్తి - భోగాపురం

సిఎం చంద్రబాబును ఎపి రాష్ట్ర మార్క్ ఫెడ్ చైర్మన్ కర్రోతు బంగార్రాజు మంగళవారం సచివాలయంలో కలిశారు. ఈ సందర్భంగా నియోజకవర్గంలోని కొన్ని సమస్యలను ఆయన దృష్టికి తీసుకువెళ్లారు. ముఖ్యంగా విమానాశ్రయం నిర్మాణంలో భూములు కోల్పోయి నేటికీ పరిహారం అందని కొంతమంది రైతులకు పరిహారం త్వరతగతిన అందేలా చూడాలని సిఎంను కోరారు. ఇటీవల కురిసిన అకాల వర్షాలకు పంటలు కోల్పోయిన రైతులను కూడా ఆదుకోవాలని కోరినట్లు కర్రోతు తెలిపారు.

రహదారి భద్రత అందరి బాధ్యత

ప్రజాశక్తి- నెల్లిమర్ల

రహదారి భద్రత అనేది అందరి బాధ్యతగా గుర్తెరగాలని డిప్యూటీ ట్రాన్స్ పోర్టు కమిషనర్ మణికుమార్ అన్నారు. మంగళవారం సెంచూరియన్ విశ్వవిద్యాలయంలో సిఎస్ఎఆర్ (కల్చరల్, స్పోర్ట్స్ అండ్ రెస్పాన్సిబిలిటీ) ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిధిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు రహదారి భద్రతను సామాజిక బాధ్యతగా గుర్తించి జాగ్రత్తగా నడుచుకోవాలన్నారు. ద్విచక్ర వాహనదారులు కేవలం హెల్మెట్ ధరించడంతోపాటు వాహనాలను పరిమిత స్పీడులో నడపాలన్నారు. హై స్పీడులో వాహనాలు నడిపిన వారిపై చర్యలు తీసుకోవడంతోపాటు ఎలాంటి పరిణామాలు ఎదుర్కోవాల్సి ఉంటుందో వివరించారు. ఈ కార్యక్రమంలో ఎంవిఐ రవిశంకర్ ప్రసాద్ మాట్లాడుతూ రహదారి భద్రత ప్రమాణాలపై ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారో వివరించారు. ఈ కార్యక్రమానికి అధ్యక్షత వహించిన విద్యార్థి వ్యవహారాల విభాగం డీన్ డాక్టర్ ఆర్.ఎస్.వర్మ

డిప్యూటీ ట్రాన్స్‌పోర్టు కమిషనర్

మాట్లాడుతున్న కమిషనర్ మణికుమార్

మాట్లాడుతూ విద్యార్థులు భవిష్యత్‌ను దృష్టిలో ఉంచుకొని నడచుకోవాలన్నారు. దీనికి ముందర వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ ప్రశాంత కుమార్ మహంతితో, డిప్యూటీ ట్రాన్స్ పోర్టు కమిషనర్ మణికుమార్ కొద్దిసేపు ముచ్చటించారు. ఈ కార్యక్రమంలో సిఎస్ఎఆర్ కోఆర్డినేటర్లు శ్రావణి, ఆలనా, జోగినాయుడు, పలువురు విద్యార్థులు పాల్గొన్నారు.

పశువ్యాధుల పట్ల అప్రమత్తం

ప్రజాశక్తి - వంగర

పశు వ్యాధులు పట్ల పాడి రైతులు అప్రమత్తంగా ఉండి జాగ్రత్తలు పాటించాలని బొబ్బిలి డివిజన్ పశువైద్యశాఖ డిప్యూటీ డైరెక్టర్ కె.రాజగోపాలరావు అన్నారు. స్థానిక పశువైద్య కేంద్రాన్ని ఆయన మంగళవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా రికార్డులు తనిఖీ చేసి, మందులను పరిశీలించి సిబ్బందికి సూచనలు చేశారు. పాడి రైతులతో మాట్లాడి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ వంగరకు త్వరలో పశు వైద్యున్ని నియమిస్తామన్నారు. అక్కడ పశువైద్య కేంద్రం శిథిలావస్థకు చేరుకోవడంతో నూతన భవనానికి ప్రతిపాదనలను పంపించామన్నారు. మండలంలో 26 గోశాలలు లక్ష్యం కాగా ఇప్పటి వరకు 12 మంజూరైనట్లు వెల్లడించారు. ఇప్పటి వరకు పశునష్టపరిహారానికి సంబంధించి మండలంలో 68 క్లయిమ్‌లు పెండింగ్‌లో ఉన్నాయని చెప్పారు. నిధులు కొరత కారణంగా వీటికి పరిహారం చెల్లించలేదన్నారు. ప్రస్తుతం చలిగాలు ఎక్కువగా వీస్తున్నందున ఆవులు, గేదెల్లో గొంతు వ్యాధి వచ్చే

పశువైద్య శాఖ డిడి రాజగోపాలరావు

రికార్డులను పరిశీలిస్తున్న డీడీ రాజగోపాలరావు

అవకాశం ఉందన్నారు. మేకల్లో మసూచి వచ్చే అవకాశం ఉన్నందున అత్యవసర సేవలు పొందాలనుకునే పాడి రైతులు 1962 నెంబర్‌కు కాల్ చేసి సేవలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో రాజాం, సంతకవిటి ఏడిలు బొత్స జయప్రకాష్, సిహెచ్ తిరుపతిరావు, ఎల్ఎస్ఎ గోపాల్, పశువైద్య సిబ్బంది పాల్గొన్నారు.

పెరిగిన విద్యుత్తు ఛార్జీలపై వైసిపి పోరుబాట

ప్రజాశక్తి-చీపురుపల్లి

పెరిగిన విద్యుత్ ఛార్జీలకు వ్యతిరేకంగా ప్రజల తరుపున కూటమి ప్రభుత్వంపై పోరుబాట తలపెట్టినట్లు వైసిపి ప్రచార విభాగం జిల్లా అధ్యక్షుడు వలిరెడ్డి శ్రీనివాసనాయుడు, మండల పార్టీ అధ్యక్షుడు ఇప్పిలి అనంతం, జిల్లా యువజన విభాగం ఉపాధ్యక్షుడు బెల్లాన వంశీకృష్ణ, మాజీ జెడ్‌పిటిసి మీసాల వరహాలనాయుడు అన్నారు. మంగళవారం స్థానిక వైసిపి కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల పోరుబాట పోస్టర్‌ను ఆవిష్కరించారు. నియోజకవర్గ కేంద్రంలో ఈ నెల 27న పోరుబాట కార్యక్రమాన్ని చేపట్టనున్నామని జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో శాసనమండలి సభ్యులు బొత్స సత్యనారాయణ, జిల్లా పార్టీ అధ్యక్షుడు మజ్జి శ్రీనివాసరావు, మాజీ ఎమ్‌పి బెల్లాన చంద్రశేఖర్ పాల్గొంటారని వారు తెలిపారు. ఈ సమావేశంలో వైసిపి నాయకులు దన్నాన జనార్ధన, పతివాడ రాజారావు, బెల్లాన త్రినాథ్, రఘుమండ త్రినాథ, బాణాన శ్రీనివాసరావు, రేవల్ల సత్తిబాబు, కోరుకొండ

కొత్తవలస: పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న మాజీ ఎమ్మెల్యే కడుబండి

దాలయ్య, కొమ్ము చిరంజీవి, గవిడి సురేష్, కర్రోతి ప్రసాద్, ప్రభాత్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

కొత్తవలస: ప్రజలపై విద్యుత్ ఛార్జీల అదనపు భారాన్ని మోపుతున్న కూటమి ప్రభుత్వ వైఖరికి నిరసనగా స్థానిక వైసిపి క్యాంప్ కార్యాలయంలో మాజీ ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు పోరుబాట పోస్టర్ విడుదల చేశారు. ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ప్రజలకు వరుసగా షాక్‌ల మీద షాక్‌లు ఇస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి నీలంశెట్టి గోపమ్మ, మాజీ పిఎసిఎస్ అధ్యక్షులు గొరపల్లి శివ, కొత్తవలస మేజర్ పంచాయతీ సర్పంచ్ మచ్చ ఎర్రయ్య రామస్వామి, వేపాడ మండల పార్టీ అధ్యక్షులు మమ్ములూరి జగన్నాథం, చినరావుపల్లి సర్పంచ్ భూసాల దేముడు, కంటకాపల్లి సర్పంచ్ మదిన అప్పలరాము, పల్లా భీష్మ, పీతల కృష్ణ, బాలరాజు తదితరులు పాల్గొన్నారు.

రామభద్రపురం: రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం విద్యుత్ ఛార్జీలు అధికంగా పెంచి సామాన్య, పేద, మధ్యతరగతి ప్రజలను దారుణంగా మోసం చేసిందని బొబ్బిలి మాజీ ఎమ్మెల్యే శంబంగి వెంకట చినప్పలనాయుడు ఆగ్రహం వ్యక్తం చేశారు. స్థానిక వైసిపి కార్యాలయంలో మంగళవారం వైసిపి పోరుబాట పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి చొక్కావు లక్ష్మణరావు, వైసిపి నాయకులు ఏక్నాథ్, కిర్ల చంద్రశేఖర్, చింతల సింహాచలంనాయుడు, కోట అప్పలనాయుడు, గొట్టావు పైడిపునాయుడు, మీసాల రామారావు తదితరులు పాల్గొన్నారు.

ఒబెరాయ్ హోటల్ రహదారికి స్థల పరిశీలన

ప్రజాశక్తి - భోగాపురం

విశాఖ జిల్లా భీమిలి మండలం అన్నవరం సముద్ర తీరాన నిర్మిస్తున్న ఒబెరాయ్ హోటల్ నుంచి విమానాశ్రయానికి వెళ్లేందుకు అప్రోచ్ రోడ్డు నిర్మాణానికి మంగళవారం భూములను పరిశీలించారు. విఎంఆర్‌డిఎ, రాష్ట్ర టూరిజం శాఖ, భీమిలి రెవెన్యూ అధికా రులతో పాటు మండల రెవెన్యూ అధికా రులు రెండు జిల్లాల పరిధిలో ఉన్న భూములకు సంబంధించిన వివరాలను పరిశీలించారు. ఒబెరాయ్ హోటల్ నుంచి దిబ్బల పాలెం గ్రామం వరకు, తూడెం నుంచి దిబ్బల పాలెం గ్రామం వరకు ఉన్న ఈ రెండు రోడ్లను కూడా పరిశీలించారు. ఇందులోని ఏదో ఒక రోడ్డు నుంచి విమానాశ్రయానికి వెళ్లేందుకు రహదారి నిర్మాణం చేపట్టేందుకు పరిశీలిస్తున్నట్లు తెలిపారు.

యోగాతో ఆరోగ్యం

భోగాపురం : నిత్యం యోగా చేయడం వల్ల ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చునని యోగా అధ్యాపకులు కె.శ్రీనివాసరావు అన్నారు. మండలంలోని బసవపాలెం అవంతి ఇంజనీరింగ్ కళాశాలలో యోగాపై విద్యార్థులకు మంగళ వారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యోగా వల్ల జ్ఞాపక శక్తితోపాటు మనం చేసే పనిపై ఏకాగ్రత కలుగుతుందన్నారు. అనారోగ్య సమస్యలను కూడా దూరంగా ఉంటాయన్నారు. ప్రతిరోజు క్రమం తప్పకుండా చేయడం వల్ల శరీరానికి ఎంతో మేలు చేస్తుందని తెలిపారు. కళాశాల ప్రిన్సిపాల్ పి. గోవిందరావు మాట్లాడుతూ యోగా సాధన చేయడం వల్ల మానసిక పరిస్థితి కూడా తక్షణమే మెరుగుపడుతుందన్నారు. శరీరంలోని ప్రతి అవయవంలో రక్త ప్రసరణ కూడా చక్కగా జరుగుతుందని వివరించారు. వైస్ ప్రిన్సిపాల్ కె.భాస్క రరావు, కళాశాల ప్రతినిధి ముత్తం శెట్టి మహేష్, పరిపాలన అధికారి జి అశోక్ కుమార్, పీడీ ఎం నరేష్, అధ్యాపకులు పాల్గొన్నారు.

బొబ్బిలిలో ఎడతెరిపిలేని వాన

బొబ్బిలి: బంగాళాఖాతంలో ఏర్పడిన వాయుగుండం ప్రభావంతో పట్టణం, గ్రామీణ ప్రాంతాల్లో ఎడతెరిపి లేకుండా వర్షం కురుస్తుంది. సోమవారం రాత్రి ప్రారంభమై నిరంతరాయంగా కురవడంతో రాకపోకలకు ప్రజలు, ఉద్యోగులు, విద్యార్థులు అవస్థలు పడుతున్నారు. పూల్ బాగ్ రోడ్డుపై గోతులలో వరదనీరు చేరడంతో వాహనదారులు, ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వర్షంతో పొలాల్లో ఉన్న వరి కుప్పలు తడిసి పోతున్నాయని, అపరాలు, మొక్కజొన్న, పత్తి పంటలకు నష్టం జరుగుతుందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

పోస్టర్ ఆవిష్కరణ

విజయనగరం: జాతీయ ఆదివాసీ గిరిజన అభ్యుదయ సంఘం 50వ ఆవిర్భావ దినోత్సవ వాల్‌పోస్టర్లను కలెక్టర్ బిఆర్ అంబేద్కర్ మంగళవారం ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఆ సంఘం అధ్యక్షులు ఆరిక చంద్రశేఖర్‌తో పాటు ఇ.రామకృష్ణ, డి.సీతారాం, ఆర్ఎస్‌వి దొర, డి.సురేష్ పాల్గొన్నారు. ఈ నెల 26, 27 తేదీల్లో భద్రాచలంలో ఆవిర్భావ దినోత్సవ వేడుకలు జరుగుతాయని సంఘ నాయకులు తెలిపారు.

ఆర్యవైశ్యుల అభివృద్ధికి కృషి

విజయనగరం టౌన్: ప్రభుత్వ సహకారంతో ఆర్య వైశ్యుల ఉన్నతికి, అభివృద్ధికి కృషి చేస్తానని ఆర్యవైశ్య కార్పొరేషన్ డైరెక్టర్ కుసుమంచి సుబ్బారావు అన్నారు. మంగళవారం జిల్లా ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు చెరుకూరి నాగరాజు ఆధ్వర్యంలో డైరెక్టర్ సుబ్బారావును ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యక్షులు తవ్వా మోహనరావు, కార్యదర్శి డిమ్స్ రాజు, కోశాధికారి రామారావు, యువజన సంఘం అధ్యక్షులు ఆరిశెట్టి సందీప్, బండారు చంద్రశేఖర్ పాల్గొన్నారు.

భూ సమస్యలపై ఎమ్మెల్యేకు ఫిర్యాదు

ప్రజాశక్తి - భోగాపురం

మండలంలోని ముక్కాం, తోటపల్లి గ్రామాలకు చెందిన రైతులు తమ భూ సమస్యలను ఎమ్మెల్యే లోకం మాధవి దృష్టికి మంగళవారం తీసుకువెళ్లారు. మిరాకిల్ లోని క్యాంపు కార్యాలయానికి వెళ్లి రైతులు తమ సమస్యలను ఆమెకు చెప్పుకున్నారు. సుమారు 40 ఏళ్లగా భూమి తమ సాగు హక్కులో ఉందని వేరే వాళ్ళు వచ్చి తమ భూమి అంటున్నారని మరి కొంతమంది రైతులు ఎమ్మెల్యేకు ఫిర్యాదు చేశారు. దీనిపై ఆమె వెంటనే స్పందించి తహశీల్దార్ ఎం.సురేష్, సిఐ ప్రభాకరరావుతో మాట్లాడి బాధితులకు న్యాయం జరిగేలా చూడాలని ఆదేశించారు. ఈ ప్రాంత రైతులకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకుంటామని వారికి భరోసా ఇచ్చారు. ముక్కాం ఎంపిటిసి గణగళ్ళ బాబాజీ, మైలపల్లి నర్సింహులు, బడే నాయుడు, పల్లంట్ల జగదీశ్ తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేకు ఫిర్యాదు చేస్తున్న రైతులు

మోసాలపై ఫోరంలో ఫిర్యాదు చేయండి

ప్రజాశక్తి- డెంకాడ

వస్తు సేవలో లోపం జరిగినా, కల్తీలు, మోసాలతో మిమ్మల్ని బోగస్ సంస్థలు మోసగిస్తే ఆన్‌లైన్ అన్యాయం జరిగినా వెంటనే జిల్లా వినియోగదారుల ఫోరంలో ఫిర్యాదు చేసి తగిన న్యాయం పొందే అవకాశం ఉందని జిల్లా పౌరవేదిక అధ్యక్షుడు భీశెట్టి బాబ్జి యువతకు పిలుపునిచ్చారు. జాతీయ వినియోగదారుల దినోత్సవం సందర్భంగా జిల్లా పౌరవేదిక ఆధ్వర్యంలో ప్రిన్సిపాల్ వి.వి.రామారెడ్డి అధ్యక్షతన మంగళవారం లెండి ఇంజనీరింగ్ కాలేజీలో వినియోగదారుల చైతన్య సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా బాబ్జి మాట్లాడుతూ 1986 డిసెంబర్ 24ని భారత ప్రభుత్వం జాతీయ వినియోగదారుల దినోత్సవంగా ప్రకటించి చట్టాన్ని ప్రజల ముందుకు తీసుకు వచ్చిందన్నారు. 2009లో వినియోగదారుల చట్టంలో అనేక సవరణలు తీసుకు వచ్చిందని, వినియోగదారుడే రాజు అనే విషయాన్ని మరిచి పోకూడదని అన్నారు. పౌరవేదిక ఉపాధ్యక్షుడు పిడకల ప్రభాకరరావు మాట్లాడుతూ జిల్లా పౌర వేదిక ఆధ్వర్యంలో జాతీయ వినియోగదారుల దినోత్సవం వారోత్సవాలు నిర్విరామంగా బెస్ట్ డిగ్రీ కళాశాల, మహాలక్ష్మి డిగ్రీ కళాశాల, అదిత్యా, ఎమ్.ఎస్.ఎన్. ఏ.జి.ఎల్.కాలేజీల్లో నిర్వహించామని చెప్పారు. ఈ సమావేశంలో వైస్ ప్రిన్సిపాల్ టి.హరిబాబు, పౌరవేదిక కార్యదర్శి తుమ్మగంటి రామ్మోహన్ రావు, పొన్నాడ కనకాచారి, ఎన్.వి.ఎన్.బ్లడ్ బ్యాంక్ అధినేత తాడేపల్లి నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

అన్నదాతలను ఆదుకోవాలి: సిపిఎం

ప్రజాశక్తి- మెంటాడ

తుపాను కారణంగా మండలంలో గత వారం రోజులుగా కురుస్తున్న వానలకు అన్నదాతలు తీవ్రంగా నష్టపోయారని అటువంటి రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని సిపిఎం నాయకులు రాకోటి రాములు అన్నారు. మండల కేంద్రంలోని వరి పొలాల్లో నీటమునిగిన వరి కుప్పలను ఆయన మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎకరా వరి పండించేందుకు రైతుకు సుమారు రూ.30 నుంచి రూ.40వేలు వరకూ ఖర్చవుతుందని చలా మంది రైతులు అప్పులు చేసి మదుపులు పెట్టారని అకాల వర్షంతో పంట మొత్తం నీటిపాలైందని చెప్పారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తక్షణమే స్పందించి నష్టపోయిన రైతులకు ఎకరాకు రూ.50 వేలు నుంచి రూ.60 వేలు వరకూ నష్టపరిహారంగా చెల్లించాలని డిమాండ్ చేశారు. వరి రైతులతో పాటు ఉద్యానవన పంటలు, అపరాలు పనికి రాకుండా పోయాయని ఆ రైతులను కూడా ఆదుకునేందుకు చొరవ తీసుకొని తక్షణమే నష్టపరిహారాన్ని అందించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో రైతులు నడుపూరి అప్పలనాయుడు, తాడ్డి కృష్ణ, తాడ్డి అప్పలనాయుడు, సారా అప్పన్న, సారా చిన్నరాం, మండల కృష్ణ, పంటల అచ్చయ్య, గురజాన వెంకటరమణ తదితర రైతులు పాల్గొన్నారు.

ఘనంగా క్రిస్మస్ వేడుకలు

ప్రజాశక్తి - రామభద్రపురం

క్రిస్మస్ వేడుకలను స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం ఘనంగా నిర్వహించారు. రావివలస పంచాయతీ కార్యదర్శి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో తహశీల్దార్ సులోచనరాణి ముఖ్య అతిథిగా అన్ని ముఖ్య శాఖల అధికారులు, సిబ్బంది క్రిస్మస్ కేక్ కట్ చేసి పరస్పరం శుభాకాంక్షలు తెలుపుకున్నారు. ఈ కార్యక్రమంలో డిటి గిరిధర్, ఇఒపిఆర్‌డి వెంకట రమణ తదితరులు పాల్గొన్నారు.

బొండపల్లి: మానవాళికి క్రీస్తు బోధనలు ఆచరణీయం, అనుచరనీయమని తహశీల్దార్ డి.రాజేశ్వర రావు అన్నారు. మంగళవారం స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో క్రిస్మస్ సందర్భంగా ప్రజలకు పలువురు ఉద్యోగులకు తహశీల్దార్ రాజేశ్వర రావు శుభాకాంక్షలు తెలిపారు. తొలిత తహశీల్దార్ రాజేశ్వర రావుతో పాటు పలువురు ఉద్యోగులు క్రిస్మస్ కేకును కట్ చేశారు. ఈ కార్యక్రమంలో ఆర్.ఐ హరికృష్ణ, విఆర్ఒలు డి.అప్పలకొండ, నాగరాజు, అలమండ లక్ష్మి, శివ, దుర్గ, రాంబాబు, ప్రభాకర్‌రావు సిబ్బంది పాల్గొన్నారు.

బొబ్బిలి: కొవ్వొత్తులతో సందడి చేస్తున్న జెసి రాజు తదితరులు

వేపాడ: మండల కేంద్రంలోని శ్రీవిక్టరీ ఇంగ్లీష్ మీడియం ఉన్నత పాఠశాలలో క్రిస్మస్ వేడుకలు మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పిల్లల పాడిన పాటలు, వేశదారణలు పలువురిని ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో పాఠశాల అడ్మిన్ డైరెక్టర్ రాఘవ్, ఉపాధ్యాయులు, పాల్గొన్నారు.

శృంగవరపుకోట: స్థానిక నారాయణాస్ కేంబ్రిడ్జ్ పాఠశాలలో మంగళవారం క్రిస్మస్ వేడుకలు మంగళవారం ఘనంగా నిర్వహించారు. పాఠశాలలో ఈ-కిడ్స్ విభాగంలో చిన్నారులు అందరూ వివిధ రకాల వస్త్ర వేషధారణలో అలరించారు. దేవదూతలు, క్రిస్మస్ తాత మొదలగు వేషాలు వేసి, పండగను ఘనంగా జరిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఏజియం శివరాం, ప్రిన్సిపాల్ బి.యన్.యస్.ప్రసాద్ పాల్గొన్నారు.

బొబ్బిలి: స్థానిక మహారాణి పేటలో గల సైంట్ ఆంద్రూస్ లూదరన్ చర్చ్ ఆధ్వర్యంలో మంగళవారం చర్చ్ డెలిగేట్ జెసి

వేపాడ: వివిధ రకాల వేషధారణలో చిన్నారులు

రాజు ఆధ్వర్యంలో కాండిల్ లైట్ సర్వీస్‌ను చర్చ్ పాస్టర్ రెవరెండ్ పి జాన్ విక్టర్ నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘ సభ్యులు ఇండ్లను చర్చ్ ప్రతినిధులు, సభ్యులు సందర్శించి క్రీస్తు సందేశాన్ని ఇస్తూ ఆ కుటుంబానికి ప్రత్యేక ప్రార్ధనలు నిర్వహించారు. చర్చ్ ప్రతినిధులు పివిఎ మెర్సీ బాయ్, డేవిడ్ జె విక్టర్ తదితరులు పాల్గొన్నారు.

విజయనగరంకోట: జిల్లా ప్రజలకు కలెక్టర్ డాక్టర్ బిఆర్ అంబేద్కర్ క్రిస్మస్ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ మేరకు జిల్లా అధికారుల సంఘం, జిల్లా రెవెన్యూ అసోసియేషన్ ఆధ్వర్యాన వేర్వేరుగా మంగళవారం కలెక్టరేట్‌లో ఏర్పాటుచేసిన కేక్‌ను కలెక్టర్ కట్ చేశారు. కార్యక్రమంలో జెసి సేతు మాధవన్, డిఆర్ఓ ఎస్.శ్రీనివాసమూర్తి, డిఆర్‌డిఎ పీడీ కళ్యాణచక్రవర్తి, సిపిఒ బాలాజీ, ఎస్‌డిసిలు మురళీకృష్ణ, నూకరాజు, సుధారాణి, ప్రమీలాగాంధీ, ఆర్‌డిఒ రామ్మోహన్, కలెక్టరేట్ ఎఒ దేవ్ ప్రసాద్, రెవెన్యూ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు తాడ్డి గోవింద, తదితరులు పాల్గొన్నారు.

IN THE HONOURABLE COURT OF THE ADDITIONAL JUNIOR CIVIL JUDGE (SPECIAL MOBILE COURT) AT VIZIANAGARAM
O.S. No.335/2020.

BETWEEN:
Abothula Gurunaidu
....Petitioner/Plaintiff.
AND:
Mandapati Varma Raju
.....Respondent/ Defendant.
TO.
Mandapati Varma Raju, S/o. Satyanarayana Raju, R/a. D.No.616, Rajeev Nagar Colony, Vizianagaram Town and District.

NOTICE

It is here by informed that the above named petitioner filed the above suit against the respondent praying the honorable court that to take summons. It is therefore informed to the above case is posted to **dt 02-01-2025** and you are informed to attend before the Honorable court on that day at **10-30 A.M.** or otherwise you will be set Ex-party.

GORLE RAMANJANEYULU,
Advocate, KUMARAM,
VIZIANAGARAM